మల్లన్న భక్తులకు తాగునీటి గోస

ఏటేటా పెరుగుతున్న భక్తులు

అందుకు అనుగుణంగా పెరగని సౌకర్యాలు

ఆలయ పరిసరాల్లో తాగునీరు లభించక ఇక్కట్లు

దప్పికేస్తే బాటిల్ కొనుక్కోవాల్సిందే 8

సంగారెడ్డి గడ్డ.. పండుగలకు అడ్డా



సంగారెడ్డిలో తాజాగా జరిగిన దసరా వేడుకల్లో జగ్గారెడ్డి

- జగ్గారెడ్డి నేతృత్వంలో నాలుగున్నర దశాబ్దాలుగా నిర్వహణ
- ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో 20 ఏళ్లు.. సొంతంగా మరో 25 ఏళ్లు
- మిఠాయి వీరన్న, కారం వీరన్న భాగస్వామ్యంతో ఆరంభం
- పండుగలకు కేరాఫ్‌గా నిలుస్తున్న సంగారెడ్డి

సంగారెడ్డి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి గడ్డ పండుగలకు అడ్డాగా మారింది. తాజాగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి నేతృత్వంలో జరిగిన విజయదశమి వేడుకలతో మరోసారి రుజువైంది. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా అన్ని పండుగలను అట్టహాసంగా నిర్వహించడం ప్రత్యేకతగా చెప్పవచ్చు. సంక్రాంతి, శ్రీరామనవమి, మహాశివరాత్రి, ఉగాది, బోనాలు, వినాయక చవితి, దసరా పర్వదినాలను ఇదే రీతిలో జరుపుతున్నారు. 45 ఏళ్ల క్రితం మిఠాయి వీరన్న, కారం వీరన్న భాగస్వామ్యంతో ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ సంస్థల ఆధ్వర్యంలో జగ్గారెడ్డి పండుగల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. 25 ఏళ్ల నుంచి జగ్గారెడ్డి సొంతంగా పండుగల వేడుకలను కొనసాగిస్తున్నారు. ఫలితంగా పండుగల నిర్వహణకు కేరాఫ్ అడ్రస్‌గా సంగారెడ్డి నిలుస్తున్నది.



కొడుకు దత్తుసాయిరెడ్డి, కూతురు జయారెడ్డితో జగ్గారెడ్డి

రక్త సంబంధం

వాట్సాప్ గ్రూప్‌తో ఇప్పటివరకు ఐదున్నరవేల మందికి రక్తదానం

ముగ్గురిలో వచ్చిన ఐడియా 7

రక్తదాతలుగా వందలాది మంది..

ఎక్కడ ఆపద ఉంటే అక్కడికి వెళ్లి..

మోడల్ స్కూల్‌లో కంప్యూటర్ల చోరీ

- రూ.4 లక్షల విలువైన 9 ల్యాప్‌టాప్‌లు, 3 సిస్టమ్‌ల అపహరణ

మద్దూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మోడల్ స్కూల్‌లో కంప్యూటర్‌లు చోరీకి గురైన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. స్కూల్ అధ్యాపకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్కూల్‌కు గత నెల 21 నుంచి అక్టోబరు 3 వరకు దసరా సెలవులు ఇచ్చారు. సెలవులకు ముందే కంప్యూటర్ ల్యాబ్‌లోని 9 ల్యాప్‌టాప్‌లను అట్ట బాక్స్‌లో భద్రపర్చి, గదికి సీల్ వేశారు. గత నెల 26, 27న ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛ విద్యాలయం పేరిట పాఠశాలను శుభ్రపరిచారు. 27న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు స్కూల్‌లోకి ప్రవేశించి కంప్యూటర్ ల్యాబ్ ముందున్న సీసీ కెమెరాను పక్కకు తిప్పేశారు. కిటికీ ద్వారా ల్యాబ్‌లోకి ప్రవేశించి, లోపలి సీసీ కెమెరాను పక్కకు జరిపారు. రూ.4 లక్షలకుపైగా విలువచేసి ల్యాబ్‌లోని అట్ట పెట్టెలో దాచిన 9 కంప్యూటర్లతో పాటు ప్రభుత్వం అందించిన 3 కంప్యూటర్ సిస్టమ్స్‌ను అపహరించారు. స్థానిక ఎస్‌ఐ షేక్ మహబూబ్ అలీతో కలిసి చేర్యాల సీఐ ఎల్. శ్రీను క్లూస్ టీం అధికారులతో కలిసి శనివారం స్కూల్‌ను సందర్శించి, అధ్యాపకులు, సిబ్బందిని విచారించారు. అనంతరం సీసీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీం అధికారులు ల్యాబ్‌లో వేలిముద్రలను సేకరించారు. పక్కనే ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సీసీ కెమెరాలను పరిశీలించే ప్రయత్నం చేయగా సీసీ కెమెరాలు ఆఫ్ చేసి వెళ్లినట్లు సిబ్బంది తెలిపారు. ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో వరుస చోరీ ఘటనలు చోటుచేసుకుంటుండటంతో మండల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

గ్రామాల్లో రాజకీయ వేడి

- పోటీకి సిద్ధపడుతున్న ఆశావహులు
- సోషల్ మీడియాలో చర్చలు
- గెలుపుగుర్రాల వేటలో పార్టీలు
- ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు



సిద్దిపేట అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయా.. లేదా అన్న ఉత్కంఠ వీడకముందే గ్రామాల్లో రాజకీయ వేడి రాజుకుంది. మండల పరిషత్, గ్రామ పంచాయతీ ఎన్నికల బరిలో నిలిచేందుకు ఆశావహులు ఇప్పటి నుంచే రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అధికారులూ ఎన్నికల కోసం అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. గ్రామాల్లో ఏ నలుగురు కలిసినా ఇదే చర్చ జరుగుతోంది..

సోషల్‌మీడియా వేదికగా..

స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు ఇప్పటికే సోషల్ మీడియాలో యాక్టివ్ అయ్యారు. వాట్సాప్ గ్రూపులు కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఈసారి ఎన్నికల్లో పోటీ చేస్తే తమకు మద్దతు ఇవ్వాలని మెసేజ్‌లు పెడుతున్నారు. దీనిపై చర్చపచర్చలు సైతం జరుగుతున్నట్లు సమాచారం. దసరా పండుగ సందర్భంగా కొందరు ఆశావహులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే చర్యలకూ శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. ఇక ప్రధాన పార్టీలు సైతం కోర్టు అంశాలను పరిగణలోకి తీసుకుంటూనే ఎన్నికల్లో గెలుపుగుర్రాలు ఎవరనే విషయాన్ని ఆరా తీస్తున్నారు. అవకాశం ఇస్తే ఖర్చు చేయగల సత్తా, గ్రామం/మండలంలో ఆ నాయకుడి పలుకుబడి వంటి విషయాలను బేరీజు వేస్తున్నారు.

రిజర్వేషన్ వివరాలు..				
కేటగిరి	సర్పంచ్	వార్డులు	ఎంపీటీసీ	జడ్పీటీసీ
ఎస్సీ జనరల్	56	518	31	03
ఎస్సీ మహిళ	41	331	17	02
ఎస్టీ జనరల్	14	92	03	01
ఎస్టీ మహిళ	08	77	01	00
బీసీ జనరల్	111	1100	57	06
బీసీ మహిళ	96	896	41	05
జనరల్	94	870	46	05
జనరల్ మహిళ	88	624	34	04
మొత్తం	508	4,508	230	26

ఎన్నికలు జరిగేనా?

స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటికే షెడ్యూల్ విడుదలైంది. ఈ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ జీవో నం.9 విడుదల చేసింది. ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉండగా, ఈ నెల 8న కోర్టు ఏం చెబుతుందో అన్న టెన్షన్‌లో చాలామంది ఉన్నారు. అలాగే, రిజర్వేషన్లపై సుప్రీం కోర్టులో కేసు నమోదైంది. ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం 42 శాతం రిజర్వేషన్ కాదంటే ఏం చేస్తారన్న చర్చ జోరుగా సాగుతోంది.

ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఇటీవల చేర్యాలలో ఓ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆశావహుల పేర్లు, వారు పోటీ చేయనుకున్న ప్రాంతం వివరాలను సేకరించింది. ఆశావహుల నుంచి లిఖితపూర్వకంగా దరఖాస్తులను స్వీకరించింది. అధికార పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో స్థానం నుంచి ముగ్గురి పేర్లను తీసుకుంటున్నట్లు సమాచారం.

మీర్జాపూర్ పీహెచ్‌సీ తనిఖీ చేసిన కలెక్టర్

- విధులకు గైర్హాజరైన సిబ్బందిపై ఆగ్రహం



మీర్జాపూర్ పీహెచ్‌సీలో అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ హైమావతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్ లీవులో ఉండగా, మిగతా ఆరుగురు సిబ్బంది లీవ్ లెటర్ లేకుండా విధులకు గైర్హాజరు కావడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రోగులకు అత్యవసర సేవలు అందించాల్సిన సిబ్బంది గైర్హాజరు కావడం ఏంటని ప్రశ్నించారు. జిల్లా మెడికల్ అధికారికి ఫోన్ చేసి గైర్హాజరైన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిప్యూటేషన్, ఇతర ఫీల్డ్ వర్క్‌లో ఉన్నా తప్పని సరిగా ఆర్డర్ కాపీ ఆసుపత్రి కార్యాలయంలో ఉండాలని ఆదేశించారు. ఒకవేళ లీవు పెట్టిన సిబ్బందిపై అధికారి సెలవు మంజూరు లెటర్‌పై సంతకం చేశాకే సెలవు తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావద్దని హెచ్చరించారు. తహసీల్దార్ తరచూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లెలగడ్డ జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ శిబిరాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. జాతీయ రహదారిపై వెళుతున్న వాహనాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు 24 గంటల పాటు ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ, పరిశీలిస్తూ వీడియోగ్రఫీ తప్పనిసరిగా చేయాలని సూచించారు.



నమస్తే సదా వత్సలే..

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను గజ్వేల్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పుర వీధుల గుండా సాగింది. అనంతరం ఐవోసీ మైదానంలో నిర్వహించిన ఉత్సవాల్లో ప్రముఖులు ఆకుల నరేశ్‌బాబు తదితరులు పాల్గొని, ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలను గూర్చి వివరించారు.

- గజ్వేల్ (ఆంధ్రజ్యోతి)

మళ్లీ వానొచ్చింది

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : నాలుగు రోజుల పాటు తెరపినిచ్చిన వాన శనివారం మళ్లీ పలకరించింది. బతుకమ్మ సంబరాల్లో ఇబ్బంది పెట్టిన వరుస వానలు, పెద్ద బతుకమ్మ నుంచి కాస్త ఉపశమనం కలిగించాయి. మళ్లీ శనివారం సాయంత్రం జిల్లాలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడింది. సిద్దిపేట పట్టణంలో ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు కురవటంతో అమ్మవారి నిమజ్జన శోభయాత్రకు కాస్తా ఇబ్బందిగా మారింది. చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. ఈదురుగాలులతో పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సిద్దిపేట అర్బన్, రూరల్, నారాయణరావుపేట మండలాల్లో మోస్తరు వర్షం పడింది. హుస్నాబాద్ పట్టణంలో రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన జోరు వాన కురిసింది.

చిన్నకోడూరులో కురుస్తున్న వర్షం









సిద్దిపేటలో శోభాయాత్రకు తరలిన అమ్మవారి ప్రతిమ, మంకమ్మతోటలో అమ్మవారి శోభయాత్రలో కాశీపండితులతో ఇస్తున్న హారతి, పట్టణంలో శోభాయాత్రంలో ప్రతిమ



సిద్దిపేటలో శోభాయాత్రలో దాండియా ఆడుతున్న మహిళలు



హుస్నాబాద్‌లో శోభాయాత్రంలో మహిళలు

శోభాయమానం

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : దేవీశరన్నవరాత్రులు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 690 అమ్మవారి ప్రతిమలను మండపాల్లో ప్రతిష్ఠించి కొలిచారు. శుక్రవారం దాదాపు 350 ప్రతిమలు నిమజ్జనానికి తరలించారు. శనివారం సిద్దిపేట పట్టణంతో పాటు, చిన్నకోడూరు తదితర ప్రాంతాల్లోని ప్రతిమలు శోభయాత్రగా తరలివెళ్లాయి. పట్టణంలో 160 ప్రతిమలకు గానూ 140 శనివారం నిమజ్జనానికి బయలుదేరాయి. జిల్లా వ్యాప్తంగా రెండు రోజులపాటు 680 విగ్రహాలు నిమజ్జనం జరిగాయని పోలీస్ అధికారులు తెలిపారు.

మర్పడగలో ఘనంగా రథయాత్ర



కొండపాక, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మర్పడగ సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో ఉత్సవమూర్తుల రథయాత్ర ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువకుల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



మర్పడగలో నిర్వహించిన రథయాత్రలో జనం

ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత పారదర్శకంగా, నాణ్యంగా నిర్వహించేందుకు పౌరసరఫరాలశాఖ ఈసారి కొత్త టెక్నాలజీని ప్రవేశ పెడుతున్నది. కొనుగోళ్లలో జాప్యం జరగకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నది. ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్లు, ధాన్యం ఆరబోసేందుకు డ్రయ్యర్లను ఏర్పాటు చేస్తున్నది. దశలవారీగా అన్ని కేంద్రాల్లోనూ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నది.

కొనుగోలు కేంద్రాలకు కొత్త హంగులు

వడ్లను శుభ్రం చేసేందుకు ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్లు, డ్రయ్యర్లు

ప్రతీరోజు వాతావరణ హెచ్చరికలు.. రేపటి నుంచి తెరుచుకోనున్న సెంటర్లు

మెదక్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం ధాన్యం కొనుగోలుకు పౌరసరఫరాల శాఖ అధికారులు ముమ్మరంగా సన్నాహాలు చేస్తున్నారు. మెదక్ జిల్లాలో 503, సిద్దిపేట జిల్లాలో 439, సంగారెడ్డి జిల్లాలో 207 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ప్రభుత్వం జీవో జారీ చేసింది. తొలిసారిగా రైతులు తీసుకువచ్చే ధాన్యాన్ని శుభ్రపర్చేందుకు ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్లను ఏర్పాటు చేయనున్నది. గత సీజన్‌లో ప్రయోగాత్మకంగా మెదక్ జిల్లాలో 8 కేంద్రాల్లో ఈ క్లీనర్లను పరిశీలించారు. సత్ఫలితాలు రావడంతో 200 ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్ల కొనుగోలుకు ప్రతిపాదనలు పంపించారు. ఈ సీజన్ మధ్యలో ఇవి అందుబాటులోకి వస్తాయని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం సిద్దిపేటలో 13, సంగారెడ్డి జిల్లాలో 2 అందుబాటులో ఉన్నాయి. మరో ఎనిమిదింటికి ఇండెంట్ పెట్టారు. దీంతోపాటు ధాన్యాన్ని ఆరబెట్టేందుకు ఆటోమెటిక్ డ్రయ్యర్లను అందుబాటులోకి తెస్తున్నారు. మెదక్ జిల్లాలో నాలుగింటిని గత సీజన్‌లోనే ప్రయోగాత్మకంగా పరిశీలించి సత్ఫలితాలు రాబట్టారు. ఒక్కో డ్రయ్యర్‌కు రూ.15 లక్షల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. ఈ సీజన్‌లో మెదక్ జిల్లాలో ఆరు మార్కెట్ యార్డుల్లో ఆటోమెటిక్ డ్రయ్యర్లు ఏర్పాటు చేస్తున్నారు.



గ్రేన్ కాలిఫర్స్ యంత్రాలు

సన్నరకం ధాన్యం కోసం డిజిటల్ గ్రేన్ కాలిఫర్స్ యంత్రాలను అందుబాటులోకి తెస్తున్నారు. ప్రస్తుతం మెదక్ జిల్లాలో 450 సిద్ధంగా ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలో 419, సంగారెడ్డి జిల్లాలో 50 యంత్రాలున్నాయి. వీటితో పాటు గింజ పొట్టు వలిచేందుకు హస్క్ రిమూవర్లు, తేమను కొలిచే యంత్రాలు, ఎలక్ట్రానిక్ కాంటాలను అన్ని కేంద్రాల్లో

మిగతా 7వ పేజీలో

మూలన పడ్డ పల్లె ప్రగతి ట్రాక్టర్లు

●అటకెక్కిన చెత్త సేకరణ ●కంపుకొడుతున్న గ్రామాలు ● పట్టించుకోని అధికారులు

నారాయణఖేడ్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం కోసం గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పల్లె ప్రగతి పథకం ద్వారా ట్రాక్టర్లను కొనుగోలు చేసింది. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ట్రాక్టర్‌తో పాటు ట్రాలీ, వాటర్ ట్యాంకర్‌ను కొనుగోలు చేశారు. దీంతో ట్రాక్టర్ ద్వారా గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడానికి, తాగునీటి అవసరాలకు ట్యాంకర్ వినియోగం, చెత్త సేకరణ కోసం ట్రాలీని వినియోగించే వారు. గ్రామాల్లో సర్పంచులు కొనసాగిన సమయంలోను వారు ఏవైనా మరమ్మతులు చేయిస్తూ వినియోగించేవారు. సర్పంచుల పదవీ కాలం పూర్తి కావడానికి తోడు వీటి నిర్వాహణకు నిధులు రాక పోవడంతో పంచాయతీ కార్యదర్శులు ట్రాక్టర్లు సజావుగా ఉంటేనే నడుపుతున్నారు. చిన్నచిన్న మరమ్మతులు వస్తే కొందరు సెక్రెటరీలు మరమ్మతులు చేయిస్తే మరి కొందరూ గ్రామంలోని ఆశా వాహుల ద్వారా మరమ్మతులు చేయిస్తున్నారు. మండల పరిధిలోని సీతారాం తండాలో ట్రాక్టర్ చెడి పోయి ఆరు నెలలు కావస్తున్న మరమ్మతులు చేయించక పోవడంతో ట్రాక్టర్‌తో పాటు ట్రాలీ ట్యాంకర్ మూలన పడ్డాయి. అంతే కాకుండా మండల పరిధిలోని అంత్వార్, అకలాయి తండాలలో ట్రాక్టర్ రెండు నెలలు చెడి పోయాయి. దీంతో ఆయా గ్రామాల్లో చెత్త సేకరణ అటకెక్కి గ్రామాలు కంపుకొడుతున్నాయి. అంత్వార్ ప్రధాన రహదారి పక్కన చెత్త పేరుకు పోయింది. మరికొన్ని గ్రామాల్లో డీజిల్ వినియోగానికి కూడా నిధుల సమస్య వస్తుండడంతో, రోజు విడిచి రోజు చెత్త సేకరణ చేస్తున్నారు. ఏదిఏమైనా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పల్లె ప్రగతి ట్రాక్టర్లను కొనుగోలు చేసినప్పటికీ, నిర్వహణ సమస్యతో మూలన పడుతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెడి పోయిన ట్రాక్టర్లను మరమ్మత్తులు చేయించడమే కాకుండా వాటి నిర్వహణకు కూడా నిధులను మంజూరు చేస్తే సమస్య ఉండదని పలు గ్రామాల వారు కోరుతున్నారు. కాగా ఈ విషయమై ఎంపీవో నారాయణను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా మండలంలో మూడు గ్రామాల్లో నిధుల సమస్యతోచెడి పోయిన ట్రాక్టర్లకు మరమ్మతులు చేయించడం లేదని, మిగతా గ్రామాల్లో కొన్ని చోట్ల గ్రామంలోని పెద్దల సహకారంతో చిన్న చిన్న మరమ్మతులు చేయిస్తున్నామని, కొన్ని చోట్ల పంచాయతీ కార్యదర్శులు మరమ్మతులు చేయిస్తున్నారన్నారు.





సీతారాం తండాలో ఆరు నెలలుగా మూలన పడిన ట్యాంకర్ , ఖేడ్ మండలం అంత్వార్‌లో చెడి పోయి మూలన పడిన ట్రాక్టర్

కోతుల దాడిలో చిన్నారికి గాయాలు

●పదుల సంఖ్యలో వచ్చి ఈడ్చుకెళ్లిన వైనం



కోతుల దాడిలో గాయపడ్డ చిన్నారి కృత్తిక

శివ్వంపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కోతుల దాడిలో ఓ చిన్నారి గాయపడింది. మండల కేంద్రమైన శివ్వంపేటలో కోపూరి శేఖర్ కూతురు కృత్తిక(4)శుక్రవారం సాయంత్రం ఇంటి సమీపంలో ఆడుకుంటుంది. సమీపంలోని చెట్ల కొమ్మల్లో ఉన్న కోతులు ఒక్కసారిగా పదుల సంఖ్యలో వచ్చి చిన్నారిని ఈడ్చుకెళ్తుండగా స్థానికులు కోతులను తరిమి కొట్టారు. కాగా చిన్నారి కృత్తిక కుడి కాలుకు తీవ్ర గాయం అయింది. కుటుంబీకులు చిన్నారిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ రాబిస్ ఇమ్యూనోగ్లోబిలిన్ అందుబాటులో లేదని చెప్పడంతో వెంటనే సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తీసుకవెళ్లామని కృత్తిక తండ్రి శేఖర్ తెలిపారు. ఇళ్లకు అతి సమీపంలో ఉన్న పల్లె ప్రకృతి వనంలో ఉన్న కోతులు తరచుగా చిన్న పిల్లలపై దాడులు చేస్తున్నాయని కొమ్మలు తొలగించాలని సుమారు 50 మంది మహిళలు పంచాయతీ కార్యదర్శి రమాదేవిని కోరారు. ఆరుబయట కూర్చోవాలన్నా, వానరులు దాడులకు తెగబడుతున్నాయని కాలనీవాసులు వాపోయారు.

తిరుగు ప్రయాణాలకు తప్పని తిప్పలు

● అరకొరగా బస్సులు ● అవస్థలు పడ్డ ప్రయాణికులు



ప్రయాణికులతో కిక్కిరిసిన పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్

జహీరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగ ముగియడంతో ప్రయాణికులు వారివారి ప్రాంతాలకు వెళ్లేందుకు తిరగు ప్రయాణమయ్యారు. అయితే ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సులు లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు. వచ్చిన ప్రతీ బస్సులో ఎక్కేందుకు ఎగబడ్డారు. దీంతో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ శనివారం ప్రయాణికులతో సందడిగా మారింది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్సులను వేయాలని ప్రయాణాకులు ఆర్టీసీ అధికారులను కోరారు.

నాడు గల్లంతు.. నేడు మృతదేహంగా..

●35 రోజుల తర్వాత లభ్యమైన ఆచూకీ

●బ్రాస్‌లెట్ ఆధారంగా గుర్తింపు

పుల్‌కల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో మంజీర నదిలో దూకి గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. చౌటకూర్ మండలం శివంపేట గ్రామానికి చెందిన బడంపేట మల్లాగౌడ్ (45) ఆగస్టు 29వ తేదీన శివంపేట సమీపంలోని మంజీర నది వంతెనపై నుంచి వరద ప్రవాహంలో దూకి గల్లంతయ్యాడు. మంజీర నది ప్రవాహంలో గల్లంతైన మల్లాగౌడ్ ఆచూకీ కోసం పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ రెస్క్యూ బృందాలు ఎయిర్ బోట్లు, డ్రోన్ కెమెరాలతో గాలింపు చర్యలు చేపట్టాయి. రెండు, మూడు రోజుల పాటు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన మల్లాగౌడ్ మృతి చెంది ఉంటాడని భావించిన కుటుంబ సభ్యులు కర్మకాండ ప్రక్రియ పూర్తి చేశారు. 35 రోజుల తర్వాత సింగూరు ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ప్రవాహం తగ్గడంతో తెరిచి ఉంచిన 11 క్రస్ట్‌గేట్లకు 9 క్రస్ట్‌గేట్లను మూసేవేశారు. దీంతో దిగువన మంజీర నది ప్రవాహం కూడా తగ్గింది. మంజీర నది తీరం వెంట గల వ్యవసాయ పొలాలు కూడా వరద ప్రవాహం నుంచి బయటపడ్డాయి. అయితే, సంగారెడ్డి మండలం గౌడిచర్ల గ్రామ శివారులో నీట మునిగిన పంపుసెట్లు తేలడంతో వాటిని చూసేందుకు వెళ్లిన రైతులకు నది తీరానికి సమీపాన కొబ్బరితోటలో విద్యుత్ స్తంభానికి తట్టుకుని కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహం కనిపించింది. మృతదేహం ఉన్నదంటూ సదరు రైతులు గ్రామంలో ఉన్న మృతుడు మల్లాగౌడ్ బంధువులకు తెలియగా, వారు శివంపేటలోని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు గౌడిచర్లకు వెళ్లి పరిశీలించగా, కుడి చేతికి బ్రాస్‌లెట్ ధరించి ఉండటతో దాని ఆధారంగా మల్లాగౌడ్ మృతదేహమని గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న పుల్కల్ ఎస్సై ఎన్.విశ్వజన్ గౌడిచర్ల మంజీర నది తీర ప్రాంతానికి చేరుకుని అక్కడే శవ పంచనామా చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.



బడంపేట మల్లాగౌడ్ (ఫైల్)

వర్షానికి అదుపు తప్పిన కారు

● సూచిక బోర్డు స్తంభానికి ఢీకొని నుజ్జునుజ్జు

● తృటిలో తప్పిన ప్రమాదం



నుజ్జునుజ్జయిన కారు

పుల్‌కల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వర్షపు నీటిలో ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి రహదారి పక్కనే గల సూచిక బోర్డును ఢీకొని నుజ్జునుజ్జయిన సంఘటన శనివారం జరిగింది. చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి గ్రామ శివారులో సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై చోటుచేసుకున్న ఈ సంఘటనలో వాహన డ్రైవర్ తృటిలో తప్పించుకున్నాడు. మెదక్ జిల్లా రేగోడ్ మండలం గజవాడ గ్రామానికి చెందిన బండారు శంకర్ టీఎస్15ఎఫ్‌జీ 6644 నంబరు గల స్విఫ్ట్ డిజైర్ కారులో సంగారెడ్డి నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వర్షం పడటం..

ఆ వర్షపు నీటిలో నుంచి కారు వేగంగా ప్రయాణించడంతో అదుపు తప్పి పక్కనే ఉన్న సూచిక బోర్డు స్తంభానికి బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారు రెండు ఎయిర్ బెలున్లు ఓపెన్ కావడంతో డ్రైవర్ శంకర్ కి ప్రాణాపాయం తప్పింది. ఎన్‌హెచ్‌ఏఐ పెట్రోలింగ్ వాహన సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ధ్వంసమైన కారును రోడ్డుపై నుండి తొలగించారు.

గుండెపోటుతో ఐకేపీ వీవోఏ మృతి



న్యాలకంటి కిషన్(ఫైల్)

కల్హేర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో ఐకేపీ వీవోఏ శుక్రవారం మృతిచెందాడు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని మునిగేపల్లి గ్రమానికి చెందిన న్యాలకంటి కిషన్(47) కల్హేర్ మండల ఇందిరాక్రాంతి పథంలో వీవోఏగా విధులు నిర్వర్తిస్తున్నాడు. శుక్రవారం రాత్రి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందాడు. కిషన్ భౌతికకాయాన్ని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి సందర్శించి నివాళులర్పించి, కుటుంబసభ్యులను ఓదార్చారు. కిషన్ మృతి పట్ల ఐకేపీ ఏపీఎం వంశీక్రిష్ణ, వీవోఏల సంఘం కల్హేర్ మండల అధ్యక్షుడు నాగరాజ్, వీవోఏలు సంతాపం వ్యక్తం చేశారు.

అనుమానాస్పద స్థితిలో ..

కౌడిపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని యువకుడి మృత దేహం కనిపించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన కౌడిపల్లి పెద్ద చెరువు (మిని ట్యాంక్ బండ్) లో శనివారం (35) సంవత్సరాలు గల గుర్తు తెలియని యువకుడి మృత దేహం నీటిలో తెలియాడుతున్న దృశ్యాన్ని స్థానికులు గమనించారు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి వెళ్లి పోలీసులు వివరాలు సేకరించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రమాదవశాత్తు మరణించాడా? ఎవరైనా హత్య చేసి అత్మ హత్యగా చిత్రీకరణ చేస్తున్నారా? మృతుడు ఎవరు? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఒంటిపై నల్లటి మచ్చలు గల షార్టుతో పాటు , లైట్ కల్లర్‌లోని తెల్లటి ప్యాంటు ఉన్నాయి. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే వెంటనే కౌడిపల్లి పోలిసులను సంప్రదించాలని పేర్కొన్నారు.

రెండు బైకులు ఢీకొని ఒకరు..

● పలువురికి గాయాలు

●అతివేగమే ప్రాణాలు తీసింది

పుల్‌కల్, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దారెడ్డిపేట గ్రామ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివపేట మండలం మాలపాడ్ గ్రామానికి చెందిన మన్నె మల్లేశం (45) అందోల్ మండలం అక్సాన్‌పల్లి గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద వ్యవసాయ పనుల కోసం ఎద్దులను అద్దెకు తీసుకున్నాడు. పనులు పూర్తి కావడంతో ఆ ఎద్దులను తన అన్నతో కలిసి కాలినడకన వెళ్లి అప్పగించారు. అయితే తన అన్నను బైక్‌పై తీసుకువచ్చేందుకని వెళ్తున్నాడు. అందోలు మండలం కన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన నీరుడి గణేష్ (22) నీరుడి ప్రవీణ్ (21) బైక్‌పై మండల కేంద్రమైన పుల్కల్ వెళ్తుండగా ఎదురెదురుగా రెండు బైక్‌లు బలంగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రోడ్డుపై పడి తలకు బలమైన గాయాలవడంతో మన్నె మల్లేశం అక్కడికక్కడే మృతి చెందగా, గణేష్, ప్రవీణ్‌లకు తీవ్ర గాయలయ్యాయి. చికిత్స నిమిత్తం ఇరువురిని జిల్లా కేంద్రమైన సంగారెడ్డికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పుల్కల్ ఎస్సై ఎన్. విశ్వజన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి వృద్ధురాలు ఆత్మహత్య

కొమురవెల్లి, అక్టోబర్4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయినపూర్ గ్రామానికి చెందిన ఆలేరు ఐలమ్మ(72) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందింది. భార్యా భర్తల మధ్య మనస్పర్థలతో శుక్రవారం పురుగుల మందు త్రాగి ఆత్మహత్యాయత్నం చేయగా గమనించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె శనివారం మృతి చెందినట్లు ఎస్సై రాజు గౌడ్ తెలిపారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో యుకుడు..



వంకిడి నాగరాజు (ఫైల్)

అల్లాదుర్గం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం అల్లాదుర్గం మండలం కాయిదంపల్లిలో వెలుగుచూసింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కాయిదంపల్లి గ్రామానికి చెందిన వంకిడి నాగరాజు (28) జీవనోపాధి కోసం కుటుంబంతో కలసి హైదరాబాద్‌లో ఉంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. బతుకమ్మ, విజయదశమి పండగ సంబురాలను జరుపుకోవాలని ఆకాంక్షించి స్వగ్రామమైన కాయిదంపల్లికి వచ్చారు. శుక్రవారం సాయంత్రం అతిగా మద్యం తాగి అదే మత్తులో తన ఇంట్లో ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా కుటుంబీకులు వారించి అతడిని రక్షించారు. నాగరాజు అదే మత్తులో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో శనివారం గాలించగా సమీపంలోని ఊరచెరువువద్ద అతడికి సంబంధించిన సెల్ ఫోన్ కనిపించగా అనుమానంతో స్థానికులు చెరువులో గాలించగా అతడి మృతదేహం లభ్యమైందని గ్రామస్థులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మరొకరు..

మద్దూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన యువకుడు నారదాసు శ్రీకాంత్ (27) ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శ్రీకాంత్ ఇంటి నిర్మాణం చేపట్టాడు. డబ్బులు సరిపోకపోవడంతో అప్పు కోసం ప్రయత్నించినా అప్పు పుట్టలేదు. దీంతో మనస్తాపానికి గురై ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాడు. ఈ క్రమంలోనే ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం చేర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ తగాదాలతో రైతు ఆత్మహత్య



శ్రీను (ఫైల్)

శివ్వంపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందు తాళలేక కుటుంబ తగాదాల విషయం తండాలో భార్యాభర్తల పంచాయతీ ఏర్పాటు చేయగా మనస్తాపంతో రైతు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం తౌర్య తాండాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని భీమ్లా తండా పంచాయతీ పరిధిలోని తౌర్య తండాకు చెందిన జేర్పుల శీను భార్య దేవికి కొంతకాలంగా కుటుంబ తగాదాలు జరుగుతున్నాయి. ఈనెల రెండున శ్రీను భార్య దేవితో గొడవపడి కొట్టడంతో శనివారం తండాలో పెద్దల సమీక్షంలో మాట్లాడగా తన భార్యను ఇక నుంచి కొట్టకుండా మంచిగా చూసుకుంటానని పెద్దల సమక్షంలో ఒప్పుకున్నాడు. అంతలోనే పంచాయతీలో నుంచి లేచి వెళ్లిపోయిన శీను తిరిగి రాకపోవడంతో ఇంటికి వెళ్లి చూడగా మనస్తాపనతో ఇంట్లో స్లాపుకు ఉన్న ఇరుప ఉక్కుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపారు.

మహిళ అదృశ్యం



జ్యోతి (ఫైల్)

నర్సాపూర్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలం గూడెంగడ్డకు చెందిన ఓ వివాహిత మహిళ అదృశ్యమైంది. గ్రామం నుంచి నర్సాపూర్‌కు వచ్చి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్‌కుమార్ తెలిపారు. శనివారం ఎస్సై విలేకరులతో మాట్లాడుతూ.. గూడెంగడ్డకు చెందిన ఆవంచదుర్గయ్య జ్యోతి ఈ నెల 3న నర్సాపూర్‌లో సంతలో కూరగాయలు అమ్మడానికి వెళ్లిన భర్త వద్దకు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో పాటు ఫోన్‌లో కూడా స్పందించకపోవడంతో భర్త శనివారం పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే అంతకు ముందురోజు భార్యభర్తలిద్దరు గొడవ పడినట్లు ఈ విషయమై కూడా మనస్తాపంతో కూడా వెళ్లిఉంటుందన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.



రక్త సంబంధం

ముగ్గురిలో వచ్చిన ఐడియా
రక్తదాతలుగా వందలాది మంది..
వాట్సాప్ గ్రూప్‌తో ఇప్పటివరకు ఐదున్నరవేల మందికి రక్తదానం
ఎక్కడ ఆపద ఉంటే అక్కడికి వెళ్లి..

ముగ్గురిలో పుట్టిన ఒక చిన్న ఆలోచన... నేడు వేలాది మంది ప్రాణాలను రక్షించే మహత్తర ఉద్యమంగా మారింది. కొన్నేళ్ల క్రితం 'బ్లడ్ డోనర్స్' పేరిట ఒక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. ఎక్కడైనా రోగి ప్రాణాపాయ స్థితిలో రక్తం కోసం ఎదురుచూస్తుంటే వారు స్వంత ఖర్చులతో అక్కడికి వెళ్లి రక్తదానం చేస్తున్నారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లోనూ సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఇప్పటివరకు 5వేలకు పైగా మందికి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడారు.

- నారాయణఖేడ్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన ముగ్గురు స్నేహితులు ముజ్జు, మునీర్, సంతోష్‌పాటిల్ ఎనిమిదేళ్ల క్రితం సామాజిక దృక్పథంతో చేసిన ఒక చిన్న ప్రయత్నం నేడు ఎందరికో ప్రాణదానం చేసే వేదికగా మారింది. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలనే గొప్ప ఆలోచనతో వారు ఒక వాట్సాప్ గ్రూప్‌ను 'బ్లడ్ డోనర్స్' పేరుతో స్థాపించారు. ఈ గ్రూప్ అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం 143 మంది సభ్యులతో దిగ్విజయంగా ముందుకు సాగుతున్నది. ఇప్పటివరకు ఈ గ్రూప్ సభ్యులు 5,500 మందికి పైగా ప్రజలకు అత్యవసర సమయాల్లో రక్తాన్ని అందించగలిగారు. సాధారణంగా స్నేహితులు సరదా ముచ్చట్లకు ఉపయోగించే సోషల్ మీడియా వేదికను, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడడానికి ఖర్చు లేకుండా వినియోగించవచ్చని నారాయణఖేడ్ బ్లడ్ డోనర్స్ గ్రూప్ నిరూపించింది.

సరిహద్దులు లేకుండా..

ఈ గ్రూప్ సభ్యులు పేషెంట్‌కు రక్తం అవసరమైన చోటికి సొంత ఖర్చులతో వెళ్లి రక్తదానం చేస్తారు. వీరి సేవలు తెలంగాణకే పరిమితం కాలేదు. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో రక్తం దొరకక ఇబ్బంది పడుతున్న వారికి కూడా అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి ఆదుకుంటున్నారు. 2017లో ఏర్పాటైన ఈ గ్రూపు, కరోనా మహమ్మారి సమయంలోనూ ఏమాత్రం బెదరకుండా, కోవిడ్ నిబంధనలు పాటిస్తూ నారాయణఖేడ్ ఏరియా వైద్యశాలలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తాన్ని సేకరించింది.


నారాయణఖేడ్ రక్తదాతల వాట్సాప్ గ్రూపు సభ్యులు



50 సార్లకు పైగా..

కొంతమంది సభ్యులు 30 నుంచి 50 సార్లకు పైగా రక్తదానం చేయడం వారి నిబద్ధతకు నిదర్శనం. వ్యవస్థాపకులలో ఒకరైన మునీర్ ఒక్కరే ఇప్పటివరకు 46 సార్లు రక్తదానం చేశారు, పలుమార్లు ప్లాస్మాను కూడా దానం చేశారు. అలాగే, సంతోష్‌పాటిల్ 38 సార్లు, ముజ్జు 28 సార్లు, రాజు ముదిరాజ్ 15 సార్లు రక్తదానం చేశారు. రక్తదానంతో పాటు, ఈ గ్రూప్ సభ్యులు 2022లో నారాయణఖేడ్ పట్టణంలోని రాజీవ్ చౌక్ వద్ద చలివేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చారు. ఒక్కరితో చేయలేనిది, సామూహికంగా ఎంతటి అసాధ్యాన్ని అయినా సుసాధ్యం చేయగలమని నారాయణఖేడ్ బ్లడ్ డోనర్స్ గ్రూప్ నిరూపిస్తోంది.



ఎంతో ఆనందంగా ఉంది..



అత్యవసర పరిస్థితుల్లో రక్తం దొరకక ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న వారిని ఆదుకోవడానికే వాట్సాప్ ద్వారా ఈ గ్రూప్‌ను ఏర్పాటు చేశాం. మా గ్రూప్ ద్వారా అనేక మంది ప్రమాదం నుండి బయట పడడం మాకు ఎంతో ఆనందాన్ని ఇస్తుంది.

- ముజ్జు, బ్లడ్ డోనర్స్ గ్రూప్ వ్యవస్థాపకులు

ఇతర రాష్ట్రాలకు సైతం వెళ్తున్నాం..



ఎక్కడ రక్తం దొరకక ప్రమాదకర స్థితిలో రోగులు ఉంటే, మేము అక్కడికి సొంత ఖర్చులతో వెళ్లి రక్తాన్ని అందిస్తున్నాం. నేను ఇప్పటివరకు 46 సార్లు తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలకు వెళ్లి రక్తదానం చేశాను. ప్రతీ సభ్యుడి సహకారం ఉన్నది.

- మునీర్, బ్లడ్ డోనర్స్ గ్రూప్ వ్యవస్థాపకులు

38 సార్లు రక్తదానం చేశాను



ఆపదలో ఉండి రక్తం కోసం ఎదురు చూస్తున్న వారికి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడడం ఎంతో సంతోషంగా ఉంది. నేను ఇప్పటివరకు 38 సార్లు రక్తదానం చేశాను. సభ్యులందరూ సహకరించడం వల్లే వేలాది మందికి రక్తదానం చేయగలుగుతున్నాం.

- సంతోష్‌పాటిల్, రక్తదాతల గ్రూపు వ్యవస్థాపకులు

'స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్' విజయవంతం

- జిల్లాలో వైద్య శిబిరాలకు అనూహ్య స్పందన
- సంగారెడ్డి డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల


డా.నాగనిర్మల, సంగారెడ్డి డీఎంహెచ్‌వో

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): అతివల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 'స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లాలో విజయవంతమైందని జిల్లా డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల తెలిపారు. జిల్లాలో నిర్వహించిన వైద్య శిబిరాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు పల్లె, పట్టణాల్లో ప్రతీ ఒక్క మహిళకు ఆరోగ్య పరీక్షలు చేయాలని కేంద్రం ఆదేశించి మార్గదర్శకాలు జారీ చేయగా, అందుకనుగుణంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో 138 పీహెచ్‌సీలతో పాటు 1979 సబ్ సెంటర్, బస్తీదవాఖానాల్లో స్ర్కీనింగ్ క్యాంపులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల్లో 44547 మంది మహిళలు హాజరై వివిధ రకాల పరీక్షల చేయించుకున్నారని తెలిపారు. 24609 మందికి బీపీ, 21235 మందికి షుగర్, 9241 మందికి క్యాన్సర్, 2316 మందికి మెంటల్ హెల్త్ కౌన్సెలింగ్, 5747 మంది గర్భిణులకు ఎఎన్‌సీ, 2177 మందికి ఇమ్యూనైజేషన్, 20503 మందికి అనీమియా, 177 మందికి సికిల్‌సెల్, 5767 మందికి టీబీ స్ర్కీనింగ్ నిర్వహించినట్లు సంగారెడ్డి డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల తెలిపారు. అదేవిధంగా 11763 మందికి రుతు పరిశుభ్రత, రుతుక్రమంపై, 36132 మందికి న్యూట్రిషన్‌పై అవగాహన కల్పించినట్లు ఆమె పేర్కొన్నారు.

కోడ్ ముగిసేవరకూ ప్రజావాణి రద్దు

సంగారెడ్డి రూరల్/మెదక్ అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సంగారెడ్డి, మెదక్ కలెక్టరేట్‌లలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్లు ప్రావీణ్య, రాహుల్‌రాజ్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకూ ప్రజావాణిని తాత్కాలికంగా రద్దు చేశామని ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని, కలెక్టరేట్‌కు వచ్చి ఇబ్బందులకు గురికావొద్దని తెలిపారు. ఎన్నికలు ముగిసినానంతరం యథావిధిగా ప్రజావాణి నిర్వహిస్తామని పేర్కొన్నారు.

జెడ్పీలో ప్రత్యేక సహాయ కేంద్రం...

రెండో సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా సంగారెడ్డిలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలలో ప్రత్యేక సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. వారం రోజుల పాటు 24 గంటలు సహాయక సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఎన్నికల నిర్వహణ, ఫిర్యాదులు, సమాచారం కోసం హెల్ప్‌లైన్ నంబర్ 8125352721 ద్వారా సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎంసీఎంసీ నిబంధనలు పాటించాలి

- మెదక్ కలెక్టర్, ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) నిబంధనలు తప్పక పాటించాలని మెదక్ కలెక్టర్, ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఎంసీఎంసీ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఎన్నికల సందర్భంగా ఎంసీఎంసీ ద్వారా చేపడుతున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేశారు. ఐడీఓసీలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను పరిశీలించారు. ఫిర్యాదులను ఎలా పరిష్కరించాలో అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు లోబడి అభ్యర్థులు పోటీ చేయాలన్నారు. ఎంసీఎంసీలో ప్రకటనల అనుమతులను అభ్యర్థులు పొందాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్రరాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడుపాయల వద్ద తగ్గిన వరద



పాపన్నపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల్లో శనివారం మంజీర నది జోరు తగ్గింది. సింగూరు నుంచి 38,467 క్యూసెక్కుల నీరు వస్తుంది. దీంతో గతంలో పోలిస్తే ఏడుపాయల ఆలయం ముందు నుంచి ప్రవాహం తక్కువగా కనిపిస్తుంది. రాజగోపురం లోనే దుర్గమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్నారు.


నోబుల్ ఫార్మసీ కళాశాలను పరిశీలిస్తున్న ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో

తూప్రాన్‌లోనే కౌంటింగ్ కేంద్రం

నోబుల్ ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు
భవనాన్ని పరిశీలించిన తూప్రాన్ ఆర్డీవో

తూప్రాన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు తూప్రాన్‌లోనే నిర్వహిస్తున్నట్లు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. శనివారం తూప్రాన్ పట్టణ సమీపంలోని మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట శివారులోని నోబుల్ ఫార్మసీ కళాశాలను తూప్రాన్ తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో సతీష్‌లతో కలిసి పరిశీలించారు. తూప్రాన్ రెవెన్యూ డివిజన్ పరిధి తూప్రాన్, మనోహరాబాద్, మాసాయిపేట, వెల్దుర్తి, చేగుంట, నార్సింగి ఆరు మండలాలకు సంబంధించిన ఎన్నికల కౌటింగ్ ఏర్పాటుకు నోబుల్ ఫార్మసీ కళాశాలను పరిశీలించినట్లు తెలిపారు. కౌటింగ్ హాల్, సౌకర్యం, భద్రత నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు తగిన ఏర్పాట్లు, కౌటింగ్ ప్రక్రియకు సంబంధించిన అంశాలను పరిశీలన చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిబంధనలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్టు అమలులోకి వచ్చినట్లు ప్రకటించినందున రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు ఎన్నికల నియమాలను ఖచ్చితంగా పాటించాలని ఆర్డీవో సూచించారు.

అర్బన్‌పార్కులో సీతాకోకచిలుకల ట్రైయిల్ ట్రెక్



అర్బన్‌పార్కు వద్ద ప్రతినిధులతో అటవీశాఖ అధికారులు

నర్సాపూర్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి) సీతాకోకచిలుకల నెల సందర్భంగా నర్సాపూర్ అర్బన్ పార్కులో శనివారం డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా ఆధ్వర్యంలో నేచర్ ట్రైయిల్ ట్రెక్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కొత్త జాతి సీతాకోక చిలుకలు, పురుగులు, తుమ్మెదలు తదితర వాటి ఫోటోలు తీసుకున్నారు. ప్రతినిధులు ప్రకృతితో సన్నిహితంగా మమేకమయ్యారు. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న అర్బన్‌పార్కును సందర్శించి వారు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సైంటిస్టు అక్బర్‌షరీఫ్, ఎఫ్‌ఆర్‌వో అరవింద్, సెక్షన్ అధికారి సాయిరాం, బీట్ ఆఫీసర్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరదలకు తెగిన కల్వర్టులను పరిశీలించిన కలెక్టర్

- ఈనెల 8న కేంద్ర బృందం రాక
- రామాయంపేట, నిజాంపేటలో పర్యటన

రామాయంపేట /నిజాంపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల భారీ వరదలకు దెబ్బతిన్న కల్వర్టులు, రహదారులను కలెక్టర్ రాహుల్ రాజ్ శనివారం పర్యవేక్షించారు. ఆ ప్రాంతంలో జరిగిన తాత్కాలిక మరమ్మతు పనులు పరిశీలించారు. మొదట రామయంపేట మండల పరిధి కాట్రియాల - పర్వతాపూర్ రహదారిలో తెగిన వంతెనను చూశారు. అలాగే మట్టితో వాహనాలు వెళ్లేందుకు చేపట్టిన పనులను పరిశీలించారు. అనంతరం నిజాంపేట మండల పరిధి నందిగామ శివారు హైవేపై కృంగిన కల్వర్టు, నస్కల్ వెళ్లే దారిలో తెగిన వంతెన, చేపట్టిన పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నిజాంపేటలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 8న వచ్చిన వరదలకు కొట్టుకుపోయిన రోడ్లు, కల్వర్టుల పరిశీలనకు కేంద్ర ప్రత్యేక బృందం రానుందని తెలిపారు.


రామాయంపేటలో కల్వర్టు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

పాఠశాలలు పున:ప్రారంభం

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : దసరా సెలవుల తర్వాత పాఠశాలలు శనివారం ప్రారంభమయ్యాయి. గతనెల 21వ తేదీ నుంచి దసరా, బతుకమ్మ సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. 3వ తేదీతో సెలవులు ముగియడంతో శనివారం తొలిరోజు పాఠశాలలకు విద్యార్థులు అంతంత మాత్రంగానే హాజరయ్యారు. తిరిగి నేడు (ఆదివారం)కూడా సెలవు దినం కావడంతో విద్యార్థులు పాఠశాలలు హాజరుకాలేదు. తొలిరోజు 30 శాతం మంది వరకు మాత్రమే పాఠశాలలకు హాజరయ్యారని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

కొనుగోలు కేంద్రాలకు కొత్త హంగులు

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేస్తున్నారు. దొడ్డురకం, సన్నరకం ధాన్యాన్ని గుర్తించేందుకు వాటిన నింపిన సంచులను కుట్టే దారాన్ని వేర్వేరు రంగుల్లో అందజేస్తున్నారు. దీనివల్ల సన్న, దొడ్డ రకం బస్తాలు కలిసిపోకుండా జాగ్రత్తపడవచ్చు.

వాతావరణ హెచ్చరికలకు యాప్

వానాకాలం ధాన్యం కొనుగోలు సమయంలో వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రభుత్వం వాతావరణ హెచ్చరికలు చేసేందుకు ఆక్యూ వెదర్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. కొనుగోలు కేంద్రాల్లో ప్రతి రోజూ ఉదయం ఆరు గంటల లోపు ఈ యాప్ ద్వారా వచ్చే వాతావరణ హెచ్చరికలను ప్రదర్శించనున్నారు. దీంతో రైతులు ధాన్యం తడవకుండా ముందుగా జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుంది.

గుంతలమయం.. ప్రమాదాల భయం

- అధ్వానంగా మండలంలోని రోడ్లు
- కనీస మరమ్మతులకు నోచుకోని వైనం

జిన్నారం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల ధాటికి జిన్నారం మండల వ్యాప్తంగా ప్రధాన రహదారులు గుంతలమయంగా మారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఏ రోడ్డు చూసినా గుంతలుగా మారడంతో వాహనదారులు జంకుతున్నారు. ముఖ్యంగా మండలంలోని శివానగర్ నుంచి పటాన్‌చెరు వెళ్లే రోడ్డు అడుగు వేయలేని పరిస్థితి. మాధారం నుంచి బీరంగూడ, పటాన్‌చెరు వైపు వెళ్లే రోడ్డూ గుంతలుగా మారింది. జిన్నారం నుంచి అన్నారం ప్రధాన రహదారిది అదే పరిస్థితి. పారిశ్రామికవాడలైన గడ్డపోతారం, కాజీపల్లి పరిశ్రమలకు వెళ్లే రోడ్లు గుంతలు పడడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారులను బాగు చేయాలని మండలవాసులు కోరుతున్నారు.


మాదారం గ్రామ ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా గుంతలు

పోలీస్ అవుట్ పోస్ట్ ఏదీ?

- ప్రయాణికుల భద్రత గాలికి
- రైల్వేట్రాక్‌లపై తరచూ ఆత్మహత్యలు
- మెదక్ జిల్లాలో 12 స్టేషన్లున్నా.. కానరాని పోలీసులు


మనోహరాబాద్ రైల్వే స్టేషన్

రామాయంపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా పరిధిలో 12 రైల్వే స్టేషన్లున్నా పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటును మరిచారు. జిల్లాకొకటి చొప్పున ఏర్పాటు చేయాలన్న రైల్వేశాఖ నిబంధనలు తుంగలో తొక్కారు. దీంతో రైల్వే స్టేషన్లు, భోగీల్లో ప్రయాణికుల భద్రత గాలిలో దీపంలా మారింది. తరచూ రైల్వేట్రాక్ లపై ఆత్మహత్యలు, వివిధ ప్రమాదాలు జరుగుతుండడంతో పొరుగు జిల్లా కామారెడ్డి పోలీసులు కేసులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా పరిధిలో సుమారు 48కిలోమీటర్ల మేర రైల్వే లైన్లు విస్తరించి ఉండగా.. ప్రతినిత్యం ముప్పై వరకు ప్రయాణికులతో కూడిన రైళ్లు, గూడ్స్ ప్రయాణిస్తుంటాయి. వేల సంఖ్యలో హైదరాబాద్ మహారాష్ట్ర వైపు ప్రయాణిస్తుంటారు. మెదక్ జిల్లా కేంద్రం నుంచి అక్కన్నపేట మీదుగా కాచిగూడకు రోజు మూడు రైళ్లు తిరుగుతున్నాయి. అలాగే కూచారం మొదలుకొని బ్రాహ్మణపల్లి, శ్రీనివాసనగర్, పాలాట, మనోహరాబాద్, మాసాయిపేట వడియారం, మిర్జాపల్లి షేర్పల్లి స్టేషన్లు ఉన్నాయి. అయినా పోలీసుల పర్యవేక్షణ కొరవడడంతో రాత్రి వేళల్లో ప్రయాణికులు ఆందోళన పడాల్సి వస్తుంది.

నిషేధిత వస్తువుల అక్రమ రవాణాకు సులువు.

భోగీల్లో పోలీసుల తనిఖీలు లేక నిషేధిత వస్తువుల అక్రమ రవాణాకు సులువవుతున్నది. హైదరాబాదు నుంచి గుట్కా ప్యాకెట్లు, నిషేధిత సిగరెట్లు, గంజాయి లాంటిది తెస్తున్న అడ్డుకట్ట పడటం లేదు. జిల్లా పరిధిలోని మనోహరాబాద్ తూప్రాన్ చిన్న శంకరంపేట ప్రాంతాల్లో అత్యధికంగా పరిశ్రమలు విస్తరించి ఉన్నాయి. దీనిలో కూలీలకు దొడ్డి దారిన అమ్మేందుకు తెస్తున్నారని సమాచారం. అదే 12 స్టేషన్ల పరిధిలోనూ ఏ ఒక్క పోలీసు తిరగకపోవడం అక్రమ వస్తువుల రవాణాకు మార్గం ఏర్పడింది.

న్యూస్ బాక్స్

మోడల్‌స్కూల్‌లో అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

చిన్నకోడూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న హిందీ టీజీటీ అతిథి అధ్యాపక పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ కుమార్ శనివారం తెలిపారు. అభ్యర్థులు హిందీ పండిట్ అభ్యర్థులై ఉండి టెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 7వ తేదీ వరకు తమ పూర్తి బయోడేటాతో దరఖాస్తులను పాఠశాలలో సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్ 8096260062 నంబరుకు సంప్రదించాలని కోరారు.

మైనారిటీ బాలికల పాఠశాలలో...

గజ్వేల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మైనారిటీ బాలికల పాఠశాలలో ఆయా పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుధారాణి తెలిపారు. పాఠశాలలో పీజీటీ సోషల్, టీజీటీ సోషల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆయా సబ్జెక్టుల్లో బోధించేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అక్టోబరు 7న గుండన్నపల్లిలోని మైనారిటీ బాలికల పాఠశాలలో దరఖాస్తులను సమర్పించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ధర్మారం విద్యార్థినికి ఎంబీబీఎస్‌లో సీటు



ధర్మారం సౌమ్య

మిరుదొడ్డి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం గ్రామానికి చెంది కొండల్ బాలమణిల కూతురు సౌమ్య ఇటీవల విడుదల చేసిన నీట్‌లో 4158 ర్యాంకు ను సాధించింది. ఈమేరకు వరంగల్‌లోని మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఎంబీబీఎస్ సీటు రావడం పట్ల తల్లితండ్రులు కొండల్‌బాలమణితోపాటు గ్రామస్థులు సౌమ్యను అభినందించారు.

చేర్యాల ఇన్‌చార్జి ఎంపీవోగా బాధ్యతల స్వీకరణ



ఇన్‌చార్జి ఎంపీవోగా బాధ్యతలు చేపట్టిన విజయ్‌కుమార్

చేర్యాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండల ఇన్‌చార్జి ఎంపీవోగా ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కె.విజయ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎంపీవోగా పని చేసిన మహబూబ్ అలీ ఇన్‌చార్జి ఎంపీడీవోగా వ్యవహరిస్తున్న క్రమంలో సస్పెన్షన్‌కు గురయ్యారు. ఎంపీవో స్థానం ఖాళీగా ఉండటంతో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం కార్యాలయ రికార్డులలో సంతకాలు చేసి విధుల్లోకి చేరారు. ఈసందర్భంగా కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది సత్కరించారు.

నేడు గజ్వేల్‌కు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ రాక

గజ్వేల్, అక్టోబరు 4(ఆంధ్ర జ్యోతి): ఈ నెల 5, ఆదివారం రోజున గజ్వేల్ పట్టణానికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య వస్తున్నట్లు మాల మహానాడు నాయకులు తుమ్మ శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ నాయకులు పొన్నాల కుమార్, దళిత సంఘాల ఐకాస రాష్ట్ర కార్యదర్శి చిప్పల యాదగిరి తెలిపారు. జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లిలో దేవీ మహిపాల్‌పై జరిగిన దాడి పూర్వాపరాలను తెలుసుకునే ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి వస్తున్నట్లు తెలిపారు.

మల్లన్న భక్తులకు తాగునీటి గోస



- కొమురవెల్లి మల్లన్న దర్శనానికి ఏటేటా పెరుగుతున్న భక్తులు
- ఏటా సుమారు రూ.22 కోట్ల ఆదాయం
- అందుకు అనుగుణంగా పెరగని సౌకర్యాలు
- ఆలయ పరిసరాల్లో తాగునీరు లభించక ఇక్కట్లు
- దప్పికేస్తే బాటిల్ కొనుక్కోవాల్సిందే

సమస్య పరిష్కారానికి కృషి



ఆలయ పరిసరాల్లో భక్తులకు ఎదురవుతున్న సమస్యలపై ఎప్పటికప్పుడు దృష్టి సారిస్తున్నాం. భక్తులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య మా దృష్టికి వచ్చింది. త్వరలోనే అధికారులతో సమగ్రంగా చర్చించి తాగు నీటి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటాం.

- టంకశాల వెంకటేష్, మల్లన్న ఆలయకార్యనిర్వహణధికారి

కొమురవెల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి ఏటేటా భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉంది. సుమారు ప్రతి ఏటా 30 లక్షల మంది భక్తులు మల్లన్నను దర్శించుకుంటున్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రతీ ఆదివారం సుమారు లక్ష మంది భక్తులు మల్లికార్జున స్వామిని దర్శించుకుంటారు. ఆలయానికి ఆదాయం కూడా రూ.కోట్లల్లో సమకూరుతుంది. ఏటా సుమారు రూ. 22 కోట్ల మేర ఆదాయం వివిధ మార్గాల ద్వారా సమకూరుతుంది. రోజు రోజుకూ భక్తుల సంఖ్య పెరుగుతున్నా అందుకు అనుగుణంగా భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ఆలయాధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

భక్తులకు తాగునీటి ఇక్కట్లు

స్వామివారి దర్శనానికి భక్తులు క్యూలైన్లలో వేచి ఉండి దర్శనం చేసుకుని బయటకు వచ్చిన తర్వాత తాగునీటికి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఆలయం ద్వారా ఆలయ పరిసరాల్లో ముఖ్యంగా ప్రసాదాల విక్రయశాల వద్ద ఎలాంటి తాగునీటి వసతులు కల్పించకపోవడంతో భక్తులు దుకాణాల్లో వాటర్ బాటిల్స్ కొనుక్కొని తాగుతున్నారు. ఆర్థిక సామర్థ్యం ఉన్న భక్తులు వాటర్ బాటిల్స్ కొనుక్కొని తాగుతున్నా, సామాన్య భక్తులు మాత్రం తాగునీటికి తల్లడిల్లుతున్నారు. బస చేసిన గదుల వద్దకు లేదా స్థలం వద్దకు వెళ్లే వరకు దప్పికతోనే ఉంటున్నారు. ఇప్పటికైనా మల్లన్న ఆలయ పరిసరాల్లో తాగునీటి వసతి కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

జలప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేయాలి

రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల పరిసరాల్లో ఏర్పాటు చేసినట్లుగా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాల్లో కూడా జలప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేస్తే భక్తులకు తాగునీటి సమస్య తీరే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రసాదాల విక్రయశాల, క్యూలైన్ సమీపంలో, ఆలయ రాజగోపురం ముందు మల్లన్న జలప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేస్తే భక్తులకు తాగునీటి సమస్య తీరుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అందుబాటులో త్రాగునీరు సౌకర్యం లభించే అవకాశం ఉంది.ఆ దిశగా ఆలయాధికారులు చర్యలు తీసుకోవాలనీ భక్తులు కోరుతున్నారు.



ప్రసాద విక్రయశాల పరిసరాల్లో కనిపించని తాగునీటి సదుపాయం

ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలి



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వేణుగోపాల్

నంగునూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎంపీడీవో వేణుగోపాల్ అన్నారు. శనివారం నంగునూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాజగోపాలపేట ఎస్‌ఐ వివేక్‌తో కలిసి రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల మొదటి విడత ఎన్నికల్లో భాగంగా ఈ నెల 9 నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ పత్రాల స్వీకరించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఎస్‌ఐ వివేక్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చినందున ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘించకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలన్నారు. సమావేశాలు, ప్రచారాలకు తప్పనిసరి అనుమతి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ లింగం వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే అసలైన సంపద



ములుగులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యుడు

ములుగు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మానసిక, ఆధ్యాత్మిక శారీరక ఆరోగ్యమే విద్యార్థులకు అసలైన సంపదని లయన్స్‌క్లబ్ ఎడిటోరియల్ బోర్డ్ సభ్యులు బండారు రాంపణిధర్ రావు అన్నారు శనివారం ములుగులోని జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ 320 ఈ జిల్లా గవర్నర్ లయన్ అమర్నాథ్ రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమస్యలను అధిగమించే క్రమంలో విద్యార్థిని విద్యార్థులను మానసికంగా దృఢంగా తయారు చేయడానికి ఈ శిక్షణ తోడ్పాటునిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు నగదు పురస్కారం



గెలుపొందిన జట్టుకు బహుమతి అందచేస్తున్న దృశ్యం

కొండపాక,అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కొండపాక క్రికెట్ టీం ఆధ్వర్యంలో క్రికెట్ టీమ్ విజేతలకు శనివారం నగదు పురస్కారం అందచేశారు. నాలుగురోజుల పాటు జరిగిన క్రికెట్ పోటీల్లో విన్నర్ జట్టుకు రూ.20 వేలు, రన్నర్స్‌కు రూ.10వేలు అందజేశారు. టోర్నీకి సహకరించిన బీజేపీ నాయకుడు మంచాల శ్రీనివాస్ గౌడ్, డీఆర్ రాజ్యం, కిరణ్ లను నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో క్రికెట్ టీం సభ్యులు పాల్గొన్నారు.

చైతన్య యూత్ అసోసియేషన్ కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన చైతన్య యూత్ అసోసియేషన్ సభ్యులు

కొండపాక,అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దెడ గ్రామానికి చెందిన చైతన్య యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా గున్నాల వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా తాళ్ల రవీందర్, ప్రధాన కార్యదర్శిగా బింగి భాస్కర్, సహాయ కార్యదర్శిగా లింగమూర్తి, సలహాదారులుగా రాధాకృష్ణ, బొజ్జ రాజు, బొజ్జ జగదీశ్ గోనె శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సువర్ణ

గజ్వేల్ రూరల్ అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల తెలుసుకోవాలని కుకునూరుపల్లి ఏఎస్‌ఐ సువర్ణ పేర్కొన్నారు, శనివారం గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు, గుడ్ టచ్, బాడ్ టచ్, ఈవ్ టీజింగ్, గంజాయి ఇతర మత్తు పదార్థాలు డ్రగ్స్ అక్రమ రవాణా తదితర అంశాలపై గజ్వేల్ షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెల్ఫ్ కాన్ఫిడెన్స్, సెల్ఫ్ డిఫెన్స్, మహిళల పిల్లల రక్షణకు ఉన్న చట్టాల గురించి, సోషల్ మీడియా వల్ల జరిగే లాభ నష్టాల గురించి, సైబర్ నేరాలు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు.

కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం శ్రీశైలం, ఉపాధ్యాయులు, గజ్వేల్ షీటీమ్ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ శాస్త్రబద్ధంగా చేయాలి



గజ్వేల్‌లో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

గజ్వేల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): హెచ్ ఎండీఏ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ శాస్త్రబద్ధంగా ఏర్పాటు చేయాలని, 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల నుంచి ఈ రోడ్డు వెళ్తుందని, ఔటర్ రింగ్ రోడ్డుకు 50కిలోమీటర్ల దూరం ఉండాల్సిన ట్రిబుల్ ఆర్ రోడ్డును 30కిలోమీటర్ల కంటే తక్కువ కుదించారన్నారు. పెద్దల భూముల జోలికి పోకుండా కేవలం పేదల భూముల నుంచే రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చారని మండిపడ్డారు. అధికారులు రైతులకు భూములు పోతున్నాయని నోటీసులు ఇస్తున్నారే తప్ప నష్టపరిహారం విషయంలో స్పష్టతనివ్వడం లేదన్నారు. భూమికి బదులు భూమి ఇవ్వాలని, లేదా 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామాల్లో సభలు నిర్వహించి 80శాతం మంది ఆమోదం తెలిపితేనే భూసేకరణ నిర్వహించాలన్నారు. గజ్వేల్ డివిజన్‌లో ఎకరం భూమి విలువ రూ.3 కోట్ల వరకు ఉందని, ప్రభుత్వం భూములు గుంజుకున్నా మార్కెట్ రేట్‌తో మూడు రెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పై డిమాండ్ల సాధనకు ఈ నెల 6న జరిగే ధర్నాకు రైతులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆయనవెంట సీపీఎం నాయకులు బండ్ల స్వామి, రంగారెడ్డి తదితరులున్నారు.

వరుస మరణాలతో ధర్మారంలో విషాదం



అంతిమయాత్రలో గ్రామస్థులు

మిరుదొడ్డి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వరుసగా మూడురోజుల్లో ముగ్గురు మృతిచెందడంతో మండలంలోని ధర్మారం గ్రామంలో తీవ్ర విషాదం నెలకొన్నది. బతుకమ్మ పండుగను మొదలుకొని మూడు రోజులపాటు వరుసగా మృతి చెందారు. ధర్మారం గ్రామంలో బుధవారం బతుకమ్మ పండుగ రోజున వరద రాజయ్య(60) మృతిచెందాడు. ఆ మరునాడే దసరారోజున ఉదయం అంత్యక్రియలను నిర్వహించారు. అంత్యక్రియలు ముగిశాక దసరా వేడుకలు జరుగుతుండగా గ్రామానికి చెందిన సద్దిపున్నారెడ్డి(58) అనేవ్యక్తి మృతిచెందాడు. శనివారం ఆయన అంత్యక్రియలను చేస్తుండగా అదే గ్రామానికి కూరకుల దేవయ్య(38)అనే వ్యక్తి ఇర్కోడు గుట్టల్లో అనుమానాస్పదంగా మృతిచెందినట్టు గ్రామస్థులకు సమాచారం అందింది. దీంతో కుటుంబసభ్యులు సంఘటన స్థలానికి వెళ్లారు. ఇలా పండగల సమయంలో వరుసగా ముగ్గురు మృతిచెందడంతో గ్రామంలో విషాదం చోటు చేసుకున్నది.

గ్రూప్ 1,2 విజేతలకు సన్మానం



డీఎస్పీగా ఎంపికైన ఆది దీక్షితను సన్మానిస్తున్న అంబర్‌పేట సీఐ చంద్రశేఖర్

దౌల్తాబాద్, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఆది వెంకన్న మాజీ సర్పంచ్ కూతురు ఆది దీక్షిత ఇటీవల వెలువడిన గ్రూప్ 1 ఫలితాల్లో డీఎస్పీగా ఉద్యోగానికి ఎంపికైంది. ఈ విషయం తెలుసుకున్న అంబర్‌పేట సీఐ చంద్రశేఖర్, సూరంపల్లి మాజీ సర్పంచ్ అయ్యగారి నర్సింహులు, దౌల్తాబాద్ మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్, బుడ్డ రమేష్‌తో కలిసి ఆది దీక్షితను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ. ఆది దీక్షిత పట్టుదలతో చదివి గ్రూప్ 1లో జరిగిన తొలి ప్రయత్నం పరీక్షలో డీఎస్పీగా ఉద్యోగం సాధించడం మండలానికే ఎంతో గర్వకారణమన్నారు.

గజ్వేల్‌లో..



నాయబ్ తహసీల్దార్‌గా ఎంపికైన సాయికుమార్‌ను సన్మానిస్తున్న అయ్యప్పనగర్ కాలనీవాసులు

గజ్వేల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన గ్రూప్-2 ఫలితాల్లో గజ్వేల్ పట్టణంలోని అయ్యప్పనగర్ కాలనీకి చెందిన తాటి సాయికుమార్ నాయబ్ తహసీల్దార్ పోస్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అయ్యప్పనగర్ కాలనీకి చెందిన కాలనీవాసులు సాయికుమార్‌కు శనివారం ఘనంగా సన్మానించారు.

భవిష్యత్తు అంతా బలహీనవర్గాలదే..



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితతో రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి

గజ్వేల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రాబోవు కాలమంతా బడుగు, బలహీనవర్గాలదేనని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి అన్నారు. తనను తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షురాలు కవితను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60శాతం ఉన్న బీసీల్లో ఐక్యత లోపించిన కారణంగానే రాజ్యాధికారానికి దూరం అవుతుండగా, వారిని చైతన్యం చేస్తూ సంఘటిత పోరాటం చేస్తామని ప్రకటించారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలని, ఇందుకు జాగృతి సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ జాగృతితోనే సాధ్యపడిందని పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ నేత చేరిక



శ్రీరామ్ రెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వంటేరు ప్రతాపరెడ్డి

జగదేవ్‌పూర్: అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత తొందరు శ్రీరామ్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. శనివారం ప్రతాప్‌రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ బట్టు సుధాకర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ కామల్ల భూమయ్య గ్రామ అధ్యక్షుడు నాగేల్లి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగవైభవంగా దుర్గామాత నిమజ్జనం





చేర్యాలలో దుర్గాదేవీ నిమజ్జనంలో పాల్గొన్న దేవీస్నేహ యూత్ సభ్యులు, చిన్నకోడూరులో నిమజ్జనానికి తరలుతున్న అమ్మవారి ప్రతిమ

చేర్యాల/చిన్నకోడూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రోత్సవాలు ముగిసిన నేపథ్యంలో శనివారం జిల్లాలోని పలు మండలాల్లో దుర్గాదేవీ నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. చేర్యాల మండలంలో ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో అమ్మవారి విగ్రహాన్ని ఉంచి డప్పుచప్పుళ్లు, కోలాటాలు, ఆకట్టుకునేలా ప్రత్యేక వేషధారణతో ప్రధాన వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. తమ ఇళ్ల ముంగిళ్లలోకి చేరుకున్న అమ్మవారికి మహిళలు మంగళహారతులు ఇచ్చి నీరాజనం పలికారు. చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లో శరన్నవరాత్రుల్లో నిత్య పూజలు అందుకున్న అమ్మవారి ప్రతిమలను నిర్వాహకులు శనివారం నిమజ్జనానికి తరలించారు. ఆయా గ్రామాల్లో ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర కొనసాగింది. యువకులు, చిన్నారులు, మహిళల నృత్యాలు అలరించాయి. చివరగా ఆయా గ్రామాల్లోని చెరువుల్లో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

అమ్మవారి చెంత చండీయాగం



చండీయాగంలో దుబ్బాక ఎమ్మెల్యే తదితరులు

దౌల్తాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద శనివారం చండీయాగం నిర్వహించారు. యాగంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, సోలిపేట సతీష్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట పలువురు పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.